# కాంతయ్యా సంధ్యారాగం

ఆర్. యం. చిదంబరం

కథానిక

ఆ సాయంత్రమే మెయిల్లో వచ్చిన వుత్తరాన్ని శారద కుర్చీలో కూర్చుని తాపీగా చదువుకుంది. ఉత్తరం చదువుతున్నంతసేపూ ఆమె కళ్ళల్లో కోటిభావాలు సంధ్యారాగం కమ్మిన ఆకాశపు రంగులా మారుతూ కనిపించాయి. అటువంటి ఉత్తరం వస్తుందని, తన హృదయంలో అంతరించిన బాధను, భయాన్ని తిరిగి రగుల్కొల్పుతుందని శారద ఎన్నడూ ఆశించలేదు. ఈ రీతిగా తన జీవితం రామకృష్ణ అనురాగ వాహినిలో మునిగి తేలుతూ మూడుపువ్వులు ఆరుకాయలుగా గడుస్తుందని ఆమె విశ్వసించింది. కాని ఆ ఆశకు మసంటుకుంది.

తన తండ్రి యాభయ్యోపడిలో పడుతున్నాడు. ఈకాలంలో అది పెద్దవయసే. తల నెరిసిపోతోంది. జీవితంలో అనుభవించదగ్గ గడియలు తృప్తిగా నవ్వివెళ్ళిపోయాయ్. తన తల్లి పోవటంతో మనసు వేరు విధాల మళ్లుతుందనుకుంది కాని అది భ్రమని ఇప్పుడే తెలుసుకుంది. తన తండ్రి హైస్కూలు మేష్టరు. ఎంతో ఆదరణను, గౌరవాన్ని తోడుకున్నాడు. విద్యార్థుల విద్యాప్రమాణం తగ్గుతోందన్న ఈ కాలంలో తన తండ్రి వహించవలసిన బాధ్యత ఎంతైనా వుంది. పిల్లలకోసం పాటుపడితే ఆ తృప్తి మైలురాయిలా నిలిచి పోతుంది.

గడియారం అయిదు కొట్టింది.

రామకృష్ణ వచ్చే వేళైంది. శారద వీధరుగు దిగి అతను వస్తున్నాడేమోనని చూసి తిరిగి వచ్చి కూర్చుంది.

తన తండ్రి మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నాడంటే శారదకు నవ్వూ ఆశ్చర్యం కలిగాయి. అలాంటి ఆలోచన ఎన్నడూ తట్టలేదు. తండ్రిరాసిన వుత్తరం మరీ విచిత్రంగావుంది. అత్తగారు కాశీయాత్రలకు పోయిందని పాప యోగక్షేమాలు కనుక్కునే వారెవరూ లేరని చిన్నతనంనుంచి శారదను పెంచినట్టు పాపనుకూడా బాగా పెంచి ఓ ప్రయోజకుడి చేతిలో పెట్టేదాకా తన నెత్తిమీద తట్టెడు బాధ్యతవుందని అందుకనే సీతను పెళ్ళిచేసుకుంటున్నానని రాశాడు. ఆ మాటలు శారదకి వెగటుగా కనిపించాయ్.

పాపమాట తల్చుకునే సరికి కనుకొలకుల్లో నీటిబిందువులు నిలిచాయి. చివరికది అనాథై పోయింది. అమ్మమ్మ కాశీయాత్రలకు పోతానని తనతోకూడా చాలాసారు లనుకుందికాని పాప పెళ్ళి కళ్ళచూసేదాకా కదలనని మాటిచ్చింది. ఆ మాటలు కరిగిపోయాయి.

తన తల్లివున్నప్పుడే అందరూ ఒకచోట పరుండేవారు. తనతండ్రి ముసిలితల్లి చనిపోతూ తన పేరనున్న కొద్దిపాటి ఆస్తిని కొడుక్కిచ్చి పోయింది. అదంతా అమ్మేసి అత్తగారింట్లోనే వుండిపోయాడు. అంతా ఓ కుటుంబంలోంచి వచ్చిన వాళ్ళలా సంచరిస్తూండేవారు. అందుకే అమ్మమ్మ బంగారంలాంటి కూతురుపోయినా దుఃఖాన్ని దిగమింగుకుని పాపను ఆదరంతో చూసుకుంటూ అల్లుడిదగ్గరే వుండిపోయింది. చివరకు ఆమె కూడావెళ్ళిపోయిందన్నమాట. శారదకివన్నీ తాడూ బొంగరంలేని ఆలోచనల్లా కనిపించాయి.

ఈ పెళ్ళికి తను వస్తానని ఎలాగూ ఆశించి వుండరు. కొనవూపిరిలాంటి ఆశవున్నా రేపటి పెళ్ళికి వేళ వర్తమానం పంపడు. ఈసంగతి ముందు తెలిస్తేమాత్రం తను వెడుతుందా? ముసిలివాడవుతున్న తండ్రికీ ఆమె ఆలిగా రావటం, తనుచూసి సంతోషించటం. అశుభఘోషకి శారద అర్థంలేని నవ్వు నవ్వుకుంది.

ఆఖరుకు పాపకు సవితల్లి దక్కిందన్నమాట— సీత సంస్కారమున్నదైతే — చదువుకున్నదైతే ముసిలివాణ్ణి వరిస్తుందా? చీకటి మూఢత్వంలో పెరిగినదై యుంటుంది. సవితల్లికి లోకం ఆపా

దించిన లక్షణాలన్నీ ఆమెకూ వుంటాయి. అలాంటి వాళ్ళ హృదయాలు తను స్వానుభవంతో తెలుసుకుంది.

అయినా శాంత పాపని కన్నకూతుర్లా ఎందుకు చూడకూడదూ? ... ప్రేమ సౌధపు కవాటాలు తెరిచి ఆమెనెందు కాహ్వానించ కూడదూ? శారద ఆలోచనలు కళ్ళెం తెగిన గుర్రంలా సాగిపోయాయ్.

గడియారం అరగంట కొట్టటంతో నిద్రనుంచి మేల్కొన్నట్టయింది. రామకృష్ణ వచ్చేశాడు. శారదముఖం వాడిపోయిన మల్లెపువ్వులా గమనించిన రామకృష్ణకు ఏ సూర్యుడంతటి తీక్షణ కిరణాలను వదిలాడో ఆమె కర్థంకాలేదు.

"ఒంట్లో బాగాలేదా శారదా?" కోటువిప్పుతూ అడిగాడు.

"ఆ... లేకేం?...ఏం!...అలాగడుగుతున్నారు?" అరువునవ్వు తెచ్చుకుని ప్రశ్నించింది.

"ఉత్తరం వచ్చిందా?" అంటూ శారద చేతిలోంచి వుత్తరం లాక్కున్నాడు. ఉత్తరం చేతిలో వుంచుకునే తను ఇంతసేపటినుంచి ఆలోచిస్తున్నా నన్నసంగతి అప్పటిక్కాని శారదకు జ్ఞప్తికిరాలేదు.

రామకృష్ణ ఉత్తరమంతా చదివేసి ఫక్కున నవ్వేశాడు. తనను మరుగునూనెలో పడవేసిన ఆ విషయం అతనిపట్ల చల్లని వెన్నెల ఎలా అయిందో ఆమె కంతుపట్టలేదు. "సరి! మీ నాన్నకు ఒంటరితనం తప్పింది. కాలం మారిందనుకున్నా ఆడాళ్ళ సంఖ్య ఎక్కువై పోతోందిమరి...ఏంచేస్తాం!... పాపం! మాష్టారికి కాంపోజీషన్ పుస్తకాలు దిద్దటానికి బాగా సహకరిస్తుంది" అనేసి మళ్ళీ పకపక నవ్వాడు. ఆ హ్యూమర్‌ని ఆస్వాదించి ఆనందించే పరిస్థితుల్లోమాత్రం శారదలేదు. నవ్వుతున్న రామకృష్ణ హఠాత్తుగా ఆగిపోయి "అలా దిగులుగా వున్నావే?... నా కాఫీ కూడా మర్చిపోయావే?" అన్నాడు.

శారద నాలిక్కొరుచుకుని కాఫీ తీసుకొచ్చింది. "మా చెల్లాయి పాపం ఎంత బాధపడుతుందో?... ఆఖరికి సవితల్లి చేతిలో పడింది"అని నిట్టూర్చింది. శారద మౌనం వెనక దాగివున్న విషాదం అతనికి బోధపడింది.

"ఆ!...మరేం ఫరవాలేదు. అయినా అసలు తల్లికంటె ప్రేమగా చూసుకుంటుందేమో! నీవన్నీ పిచ్చి సందేహాలు"అని కోర్టులో కేసుకొట్టిపారేసి నట్టు అన్నాడు. అపుడు మరి ఆమె భయం కూడా హేతుపూర్వకమైంది కాదుగా!

"అయినా ఈ కాలంలో ఈ కాశీయాత్రలు-రామేశ్వరయాత్రలమీద మోజు మరీ ఎక్కువై పోతోంది. మీ అమమ్మ వుంటే నీకీబాధ లేక పోను...అన్నీ సర్దుకో-రాత్రి ఎనిమిదింటికే బండి." అన్నాడు నవ్వటానికి సాయశక్తులా ప్రయత్నిస్తూ.

"ఎందుకు?..."

"మరి పెళ్ళికి వెళ్ళవూ?" విస్తుపోతూ అడిగాడు. "ఛీ!...ఎవరెడతారు? నాన్నకు మతిపోయి ఓపిల్ల గొంతుకోస్తుంటే చూసి సంతోషించటానికి వెళ్ళనా? అంతప్రేమవున్న తండ్రైతే నాలుగురోజులు ముందు వుత్తరం రాయడూ?

"పెళ్ళి చూడ్డానికికాదు వెళ్ళమంట — మీ పాపను చూసిరావూ?"

"పదిరోజులు పోయాకకాని వెళ్ళను. మొదట్లో బాగా చూస్తున్నట్లు నటిస్తారు. అయినా ఆ భాగోతం నేను చూడలేను...అది నావల్లకాదు. ఎటుచూచినా ఆమెకన్నీ ఎదురుగాలులే!

తండ్రిని చెడామడా తిడుతూ బారెడు వుత్తరం రాయాలనుకుంది శారద. కాని తత్కారణంగా కలిగే ఫలితాలకు తను నిలబడగలిగి వుండాలి. చివరికి తన పాపమీదకే వస్తుందేమో!...వేడికి మంచుకరిగినట్టు మన స్తిమితమంతా అంతరించింది. జైలు కటకటాల్ని విరుచుకుని రాలేక పాప బాధ పడుతున్నట్టు—మంటల్ని దాటలేక తను బాధపడుతున్నట్టు—ఊహించుకుని మథన పడింది.

పదిరోజులు గడిచాయి. శారద పుట్టింటికెళ్ళి పదిరోజులు మకాంవేసి సీత మనసంతా ముక్కలుగావిరిచి ఎనాటమీ బల్లమీది శరీరంలా తెలుసుకోవాలనుకుంది. కాని అనుకోకుండా మరో అవాంతరం వచ్చిపడింది. రామకృష్ణ ఓనాడు వర్షంలో తడుస్తూవచ్చాడు. అతనికి జలుబు పట్టుకుంది. వళ్ళుకూడా వేడిచేసింది. క్రమంగా అది శరీరంలో దగ్గు-జ్వరంలాంటి బ్రాంచాఫీసులు తెరిచింది. చివరికి నాటుమందుల పోటీకి ఆగలేక

దివాలాతీసి ఆఫీసు మూసేదాకా శారద కదల్లేక పోయింది. తండ్రి పెళ్ళయి నెలైంది.

* * *

శారదలో ఆరాటం ఎక్కువవుతోంది.

బండి అరగంట లేటు. శారదకెందుకో దిగులుగా చీకటి గుహలోకి పోతున్నట్టనిపించింది. సీత తనతో ఎలా మాట్లాడుతుందో! పూర్తి వాత్సల్యంలేని తండ్రి తన్నెలా ఆదరిస్తాడో!...పాప నిజంగా నరకం అనుభవిస్తుంటే తనేం చెయ్యాలి? ఈ ఆలోచనల్లో ఆమెకేమీ పాలుపోలేదు.

మొదటిగంట కొట్టారు. అంతులేని ఆలోచనలోవున్న శారదకా గంట వినపడనేలేదు. "ఒకవేళ సవిత్తల్లి నిజంగా సవిత్తల్లయితే ఏంచేయను?" శారద హఠాత్తుగా వేసినప్రశ్న రామకృష్ణకు అమాయకంగా కనిపించింది.

"ఇక్కడకు తీసుకురానా? దాని బాగోగులు మనం చూసుకుందాం" అని జవాబుకోసం ఆశించకుండా అనేసింది.

"తీసుకు రావచ్చు. అందుకభ్యంతరం లేదు. కాని మీ నాన్న ఒప్పుకోవాలి. బలవంతంగా తీసుకొస్తే మనస్పర్థలేర్పడి దానిపెళ్ళి బాధ్యత మననెత్తిన పడుతుంది. ముందుసంగతికూడా ఆలోచించుకోవాలి." డొంకతిరుగుడు లేకుండా స్వచ్ఛజలంలో చందమామ ప్రతిబింబంలా రామకృష్ణ అన్నమాటలు శారదకు రుచించలేదు.

బండిరాగానే శారద లేడీస్‌కంపార్టుమెంటులో కూర్చుంది. అతనందించిన పెట్టె కాళ్ళదగ్గరుంచుకుంది. ఏదో ఆలోచించినదానికిమల్లే అతని మొహంలోకి చూసింది.

"వెళ్ళగానే ఉత్తరం రాయి. పరిస్థితులు బాగా లేకపోతే వచ్చెయ్ - వృథాగా మనసు పాడుచేసుకోకు" అన్న రామకృష్ణ మాటలు రైలింజను కూతలో కలిసిపోయాయ్. శారద అంతావిన్నట్టు తల నిలువునా ఆడించింది.

రామకృష్ణ బుర్రనిండావున్న తలాతోకాలేని ఆలోచనల్ని పండుటాకులకుమల్లే విదలించుకుని యింటిముఖం పట్టాడు. అశ్రుపూరిత నయనాలతో శారద అతను వెడుతుంటే చూడగలిగినంతవరకూ చూసింది.

శారద గోవిందపురం చేరుకునేసరికి సూర్యుడు నడినెత్తిమీదున్నాడు. స్టేషనుదాటి బయటకు రాగానే క్యూలోవున్న ఒంటెద్దుబళ్ళు-జట్కాలూ రమ్మని ఆహ్వానించాయి. చేతిలోవున్న పెట్టె బరువైందికాదు. ఇల్లు అక్కడికి నాలుగడుగులు. నడచిపోటానికి నిశ్చయించుకుని బయలుదేరింది.

సందుతిరగ్గానే ఎత్తరుగులయిల్లు కనిపించింది. మనసులో దిగులు చక్రవడ్డీలా పెరుగుతోంది. అడవిలో పక్షులరొదలా మెదడంతా అనంతకోటి ఆలోచనల్తో నిండిపోయింది. మెట్లెక్కుతుంటే ఏదో కొండెక్కుతున్నట్టనిపించింది. దూరంగా హాల్లో మూలకూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న సీతకనిపించగానే శారదమనస్సు చివుక్కుమంది. దూరానికి అందంగానేవుంది. నుదుటిమీద దమ్మిడీయంత పెద్దకుంకంబొట్టుండటంవలన పెద్ద సంస్కారి - చదువుకున్నది కాదనుకుంది. పట్నవాసపు ధూళిలో సెంటువాసనలు పీల్చలేదు. ఇంతకీ ఎవరో వచ్చారన్న ప్రాథమికవిషయం కూడా తెలియనంత తన్మయత్వంతో ఆ పుస్తకం చదువుతోంది. చప్పుడుచేయాలనే ఉద్దేశముతో శారద చేతిలోవున్న చిన్న ట్రంకును నేలమీదుంచింది. మరుక్షణంలో పుస్తకాన్ని మూలపడేసి ఆశ్చర్యాన్ని ప్రకటించే కళ్ళతో సీత బయటికి వచ్చింది కాని శారద నెలా గుర్తుపట్టగలదు? కాంతయ్యకు శారదనే అమ్మాయుందని, పట్నంలో కులాసాగా కాపరంచేస్తోందది చెవుల్తో వింది కాని శారదను చూసివుంటేగా! ఆ నయన భావాన్ని గ్రహించిన శారద "నాన్నగారింటోలేరూ?" అని ప్రశ్నించింది.

"నువ్వా శారదా? స్కూలుకెళ్ళారు. ఇంకా రాలేదు. రా...వస్తున్నానని వుత్తరం ముక్కన్నా రాశావుకాదే?" అంటూ కాటుకకళ్ళు పెద్దవిచేసుకుని నవ్వుతూ అడిగింది.

"చెల్లాయెక్కడ?"

"బళ్ళోకెళ్ళింది... స్నానంచేసి భోంచెయ్యి-నిన్ననగా బయలుదేరుంటావు."

శారద మాట్లాడకుండా ట్రంకు హాలులోవుంచి స్నానాని కెళ్ళింది.

సీత పుస్తకం చదువులో పడింది.

"భోంచేయవే శారదా!" అనడిగింది స్నానం ముగించి వచ్చిన శారదను.

"పాప రానీ-ఇద్దరంకలిసి తింటాం" అంటూ అరుగుమీద కొచ్చింది. ఒంటిగంటవటంవలన పిల్ల లంతా స్కూలునుంచి ఇంటికి తిరిగి వస్తున్నారు. 'అక్కయ్యా!' అన్న పిలుపు వినగానే శారద కళ్ళల్లో నీళ్ళు నిండాయి. మరుక్షణంలో పాప అక్క ప్రేమహస్తాల్లో ఇరుక్కుపోయింది. "పాపా!...బాగా చిక్కిపోయావు సుమా!" అనంగానే పాపవంక వోసారి చూసుకుని "లేదు అక్కయ్యా!" అంది నవ్వుతూ-పుస్తకాల సంచీని పొల్లోకి విసిరింది.

"పాపకు ఈడుకుమించిన తెలివితేటలున్నాయి. ఎవడోస్తాడో కాని వాణ్ణి బజార్లో అమ్మేస్తుంది" అన్న తల్లి మాటలు జ్ఞప్తికొచ్చి శారద విషాదంగా నవ్వుకుంది.

పాప ముఖుపు తినేటంత అన్నం తినలేదు. నాలుగు మెతుకులు కలికి ఇక తింటే తన కడుపు పగిలిపోతుందని లేచిపోయింది. శారదకు ఈ పరివర్తనంతా గమనిస్తుంటే ఎవరో చిమ్మిన గ్రోవితో నిప్పు చిమ్ముతున్నట్టయింది.

గడియారం అరగంట కొట్టింది.

"అక్కయ్యా! నేను స్కూలుకు పోతున్నానే!" అని పుస్తకాలసంచీ తీసుకుంది.

"ఈ పూట మానేద్దూ! నీకోసం ఎన్ని తెచ్చానో తెలుసా?" అంది శారద.

"అబ్బ...ఆదికాదే! ఇవేళ ఇనస్పెక్టరుగారు వస్తున్నారు. వెళ్ళకపోతే మేష్టారు వీపు విమానం మోతెక్కిస్తారు."

"పాపా! అంత మాసిపోయిన బట్టలు తొడుక్కున్నావే? ఆ మురిగ్గుడ్డలతోనేనా స్కూలుకు వెళ్ళటం?" అధికార స్వరంతో వేసిన ఈ ప్రశ్నకు పాప బిక్కమొహం వేసింది.

"మరి మంచిబట్టలు లేవక్కా-ఏంచేయను?"

"అవును శారదా! రెండుమూడు రోజులుగా వర్షాలు దంచేస్తున్నాయ్-బొత్తిగా ఎండకాయటం లేదు. చాకలి రాలేదు" అని సీత అంటుంటే శారదకు నిప్పులో స్నానం చేసినట్టయింది.

"అయ్యో! చాకలి రానంతమాత్రాన మురికి రాసుకుంటారటే? నేను బట్ట లుతికిపెడతానుండు. ఈ పూట కలాగే వెళ్లు. మరేంచేయను?" ఈ మాటలు సీత గుండెల్ని దూసుకుపోయే దృక్కుల్ని సారిస్తూ అంది. పాప మాట్లాడకుండా బడికి వెళ్ళిపోయింది.

శారద విసుగ్గా నడిచిపోయి కిటికీ దగ్గర కూర్చుంది. ఇంతసేపటినుంచి అణచిపెట్టుకున్న ఆలోచనలు గాస్‌బాంబులో గాస్‌లాగ బుస్సు మన్నాయ్.

సీత మనస్తత్వాన్ని తెలుసుకోటం అసాధ్య మైంది. పాప పూర్తిగా చిక్కిపోయింది. దాని మాట-తీరు అన్నీ మారిపోయాయ్. నవ్వుతుంటే మునుపటి సువాసనలు లేవు. తనంటే మునుపున్నంత గాఢానురాగం కూడా వున్నట్టు కనిపించదు. తుర్రున స్కూలుకు పారిపోయింది. అక్కడే దానికి బాగుంది గామోలు! సీత దాన్నిలా తయారుచేసింది. బంగారురంగు పాప నల్లబడి పోయింది. తనూ చూస్తూవుంది...ఎందుకు?

ఒక్క విషయం మాత్రం శారదకు స్పష్టంగా కనిపిస్తోంది. సీతకు తనురావటం ఎంతమాత్రం యిష్టంలేదు. తనతో మనసువిప్పి మాట్లాడిందా? తనురావటం ఆమె యెలా సహిస్తుంది? పాపను తను 'వశం' చేసుకుంటుందేమోనని దాని భయం.

ఈ అంతులేని-అర్థంలేని ఆలోచనా ప్రవాహానికి వారిధికట్టేసి శారద రావమ్మగారింటికి బయలుదేరింది. తనెక్కడికి వెడుతున్నదీ శారద చెప్పనూ లేదు. సీత అడుగనూలేదు.

రావమ్మ కందులు విసురుతోంది.

"శారదమ్మా!...ఎప్పుడొచ్చావ్? మీ ఆయన కూడా వొచ్చాడా?...కులాసాయేనా?" అని చేటలోవున్న కందులన్ని ప్రశ్నలువేసింది.

శారద తాపీగా కూర్చుంది.

"ఇప్పుడే వచ్చానండి...పాపను చూద్దామని. ఆయనరాలేదు."

"ఊఁ...మీ నాన్నకు ఈవయసులోకూడా పెళ్ళి కావల్సివచ్చింది. మావాడితో అన్నాడట: ఆ చిన్నపిల్ల నెవరుచూస్తారు? అందుకని పెళ్ళి చేసుకున్నానని...ఇంతకీ నువ్వు పెళ్ళికి రాలేదుగా! ఊఁ...ఎలారాబుద్ధి వేస్తుందిలే!" అని గుక్కతిప్పు

కుండా అనేసింది రావమ్మ. 'నేను విసురుతాను... మీరాయాసం తీర్చుకోండి...' 'అచ్చంగా మీ అమ్మగుణాలే నీకు, నీకెందుకమ్మా శ్రమ... ఇప్పుడేం కంగారులేదులే!...మాకోడలూ వుంది. ఎందుకు దున్నపోతులా? అంతచాకిరీ నేను చేసుకో వలసిందేగా! దాని షోకులూ-దానిపౌడర్లకే దానికి తీరికుండదు—మావాడు దానికి తాళంవేస్తాడు..."

రావమ్మ కోడలి విషయం ఎత్తుకుంటే ఇంక వదలదని శారదకు తెలుసు.

"పాప బాగా చిక్కిపోయిందండి."

"చిక్కిపోదూమరి? ... దాన్ని చూసేవారెవ రున్నారు మీ అమ్మమ్మ కాశీయాత్రలకు పోయింది. సవితల్లి ప్రేమ నీకు తెలియదూ? ఇలా వుంచితే ఇంకా ఏమౌతుందో చెప్పలేను."

"బాగా చూడటంలేదంటారా?"

ఇది తెలివితక్కువ ప్రశ్నని శారద అనుకుంది.

"నువ్వింత అమాయకరాల వనుకోలేదు. మీ నాన్న అస్తమానం ఇంటోవుంటాడు కనకనా!... అసలే చిన్నపిల్ల. దిగులుగా వుంటుంది. ఎంత ఆదరంగా చూడాలి? తల్లికూడా లేదాయె. ఏం చేస్తుందో ఏమో!...రోజూ ఏడుపే. కొడుతూం టుంది గామోలు!...ఒకటి రెండుసార్లు పాప నూతినీళ్ళు తీసుకొస్తుండగా చూశానమ్మోయ్!... ఏమందో మాకోపెట్టి మతి విరిచేసిందేమోకూడా! ఆ తల్లే వుంటే పిల్ల మాణిక్యంలా వుండదూ?"

"ఇంతకీ అమ్మమ్మకు మతిపోయింది. దాని పెళ్ళయాక ఇష్టంవచ్చినట్టు తందనాలాడకూడదూ?" అని అక్కసంతా అమ్మమ్మమీద వెళ్ళగక్కింది.

"మీ నాన్న అలాగన్నాడు గామోలు!... అదంతా వుత్తది. అసలు సంగతి వేరేవుందిలే! ఈ పెళ్ళి ఆవిడకెంత మాత్రం ఇష్టంలేదు. ఎలావుం టుంది? ఒద్దని గొడవచేసింది. మీ నాన్న వినలేదు. విసుగెత్తి ఆ జానకి, సూరమ్మ కాశీవెడుతుంటే వెళ్ళిపోయింది. అదీకాక మీ అమ్మ పోయిన తరు వాత దానికి మతి తిన్నగా వుండటంలేదు." ఈ పరిస్థితంతా శారదకు కీకారణ్యంలా కనిపించింది.

"అయితే మరేం చేయను? నేనుమాత్రం ఇక్కడెంత కాలముండగలను?"

"నువ్వేందిగులుపడకు. పాపను తీసుకుపోతానని మీనాన్నతో చెప్పు. నీ మొగుడేమీ అనడుకదా?"

"అలాంటి దేమీలేదు. ఆయనే తీసుకొచ్చే మన్నారు."

"మీ నాన్న ఒప్పుకుంటే తీసుకుపో!...శని విరగడౌతుంది!"ఏళ్ళతరబడి తను చూస్తున్న వెలుగు చీకట్ల బతుకును—అంతులేని అగాధాల్ని చూసి నవ్వుకుంది.

ఊళ్ళోవాళ్ళనుగురించి, సీత గుణాల్నిగురించి, ఆమె గొంతుక్కి తండ్రి కట్టింది మంగళసూత్రమో పురిత్రాడో, రవణమ్మ కూతురుకు పెళ్లయిందీ లేనిదీ - మాట్లాడుకుంటుంటే అరవై నిముషాలు దొర్లిపోయాయి. శారద ఇంటి కొచ్చేసింది. మొత్తానికి పాప తండ్రిదగ్గరున్నంత కాలం ఆమె మీదికి ప్రతిక్షణం విషాదాన్ని వొలకబోస్తూ, అస్పష్ట భవిష్యన్నాదాలు పలికిస్తూ విరుచుకు పడటానికి సిద్ధంగా వుంటుంది. ఇది రావమ్మ రాతి లాంటి అభిప్రాయం. ఇటుకగోడ అడ్డుగా ఒకే యింట్లో వుంటూ అరవయ్యేళ్ళ జీవితానుభవం గడించిన రావమ్మకు ఈ విషయం ఆమూలాగ్రం అవగాహనయ్యే వుండాలి.

*  *  *

ఇన్స్పెక్టరు రావటం వలన పాప ఇంటి కొచ్చేసరికి ఐదయింది. ఇంకా పొద్దు బాగావుంది. రాగానే అక్కయ్యదగ్గరకు పరుగెత్తింది. శారద స్వయంగా నీళ్లుపోసి తలదువ్వి జడవేసింది. ఎందుకో శరీరంలో ప్రతి అణువూ అంతులేని ఆవేదనతో ఘోషించింది, పాపను తీసుకుని సుభద్ర ఇంటికి వెళ్ళొచ్చింది. పాపను సవితల్లి నానాహింసలూ పెడుతోందని- వెంటనే తీసుకుపొమ్మని సుభద్ర కూడా సలహానిచ్చింది. సుభద్ర మాటల్లో అసత్యపు ఛాయలు శారదకు కనిపించలేదు.

ఇంటికొచ్చేసరికి చీకటిపడుతూవుంది. తియ్యటి గాలి వీస్తుంటే ముందు తుఫాను గాలులు వీస్తా యన్న సంగతి మర్చిపోయి శారద తన్మయురా లయింది. ఇంటికొచ్చిన పదినిముషాలకు కాంతయ్య వచ్చాడు.

"శారద వచ్చింది" అంది సీత. కాంతయ్య చరచరా దొడ్లోకొచ్చాడు.

"శారదా!...ఎప్పుడొచ్చావమ్మా? రామకృష్ణ రాలేదూ?" అనడిగాడు.

"మధ్యాహ్నం వచ్చానునాన్నా - ఆయనకు ఆఫీసు సెలవు దొరకలేదు. అందుకని రాలేదు."

తండ్రితో మాట్లాడటం డోక్కున్నట్టున్నా ముందు తన మనోనిశ్చయానికి న్యాయం కలిగి, అశాంతి మంచులా కరిగిపోవాలి కనక మృదు ధ్వనితో తెచ్చుకున్న నవ్వుతో పలికింది. కాంత య్యలో పెద్దమార్పునుకూడా చూడగలిగింది శారద-నెరసినతలకు రంగువేస్తున్నాడు. సిల్కు చొక్కాలు తొడుగుతున్నాడు. ఇటువంటి తండ్రేనా కేవలం 'పాపకోసం' సీతను చేసుకుంట?

నిర్లక్ష్యముగా నవ్వుకుంది శారద.

'పాపా!...నీ అక్కయ్య కావాలన్నావు కదూ!... చూడు రప్పించేశాను." అన్నాడు కొత్తగా కట్టించుకున్న రెండుపళ్ళూ కనిపించేలాగ కాంతయ్య.

"ఇవేళ ఆలస్యమైందే నాన్నా! మధ్యాహ్నం కూడా రాలేదే!"

"ఆ...ఇనస్పెక్టరు వచ్చాడుకదూ మరి!"ఇంకా ఏదో అడుగుదామనుకున్న శారదకు కాంతయ్య అక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపోవటం ఆశాభంగాన్ని కలిగించింది. అమ్మమ్మను గురించి అడగాలనుకుంది. కాని అదేమన్నా మనస్పర్థలకు దారితీస్తుందేమో నని వూరుకుంది. తెలియవలసిందెలాగూ తెలిసింది. పెళ్ళికి ఎందుకు రాలేదని కాంతయ్య అడగనూ లేదు. శారద సాకులు తనంతట తను చెప్పనూ లేదు. "అక్కయ్యా!...ఇక్కడెంతసేపు కూర్చుంటాం—ఆ దొడ్లో పాములు కూడా వున్నాయి." అని పాప అనేవరకూ శారద ఈ లోకంలో లేదు.

ఇద్దరికీ ఆవేళ నిద్రపోవాలన్న కాంక్ష లేదు.ఇద్దరూ నిద్రాదేవి కబంధ హస్తాల్ని దూరంగా నెట్టేశారు.

"పాపా!..ఇనస్పెక్టరు నిన్ను ప్రశ్నలడిగాడా?"

"ఆ, రెండు ప్రశ్నలడిగారు. ఓ లెక్కకూడా అడిగారు. అన్నీ చెప్పేశాను. మొన్న అమ్మ అవన్నీ కొట్టి చదివించింది. బాగా జ్ఞాపకం వున్నాయ్!" అంది కులుకుతూ నవ్వుతూ.

"ఆ...సీత నిన్ను కొడుతూవుందన్నమాట!"

"అమ్మ" అనటం శారదకిష్టంలేదు.

"మరి చదవకపోయినా, అల్లరిచేసినా కొడుతూంటుంది."

శారద కన్నీళ్ళలో మూర్ఛాశక్తి జనించింది.

"నిజంగా! మరి నాన్నేమీ అనడూ?"

"చదవకపోతే నాన్న కొట్టమన్నాడట. అది సరేకాని అక్కయ్యా! మీవూళ్ళో పది సినిమాలున్నాయట కదూ? నేవస్తే నన్ను తీసికెడతావా!"

"ఓ తప్పకుండా-పదేవిటి? వంద సినిమాలున్నాయ్. అస్తమానం కార్లూ — గీర్లూ తిరుగుతూంటాయి. మరి నీకిక్కడ బావుందా? అమ్మమ్మలేందే ఎలా వుండగలుగుతున్నావ్?"

ఈ ప్రశ్నల కర్థం తెలుసుకునేశక్తి పాపకు లేదని శారద తరవాతనుకుంది.

"రాత్రినన్ను ఒంటరిగా పడుకోమని ఇద్దరూ హాల్లోకి వెళ్ళిపోతారు. రాత్రి నేను వాళ్ళని పిలవకూడదని నాన్నకొట్టాడుకూడా. ఆ కిటికీ దగ్గర దెయ్యం కనిపించి నాకు భయంకూడా వేస్తుంది. అలాగే కళ్ళుమూసుకుని పడుకుంటాను."

"అయితే పాపా! మరి నాతోవచ్చేస్తావా?" అని హఠాత్తుగా శారద ప్రశ్నించటంతో సిల్కుగౌను కేసిచూస్తున్న పాప తల పైకెత్తి తల నిలువునా ఆడిస్తూ "ఓ...తప్పకుండా వస్తాను. అయితే నన్ను తీసుకుపోటానికే వచ్చావన్నమాట అమ్మ దొంగా ఇంతసేపూ వూరుకున్నావ్! ఇందుకేనా?" అంటూ చప్పట్లుకొట్టింది.

"అమ్మమ్మ కాశీవెడుతూ నీతో ఏంచెప్పింది?"

"ఇక్కడుండలేకపోతే అక్కయ్య దగ్గరకు తీసికెళ్ళమని నాన్ననడుగు అంది."

"మరడిగావా?"

"అమ్మో! నాన్ననుచూస్తేనే భయంగావుంది. కొడతాడేమోనని భయంవేస్తోంది." మాట్లాడుతూ పాప నిద్రలో మునిగిపోయింది.

* * *

మర్నాడు వర్షంబాగా కురవటంవలన స్కూలుకు సెలవిచ్చారు. కాంతయ్య పదకొండుకు ఇంటికొచ్చాడు. సీత బలవంతంగా శారదను సంభాషణలోనికి దింపుతోంది.

పాప అప్పుడే ఇరవైసారులు "నన్నెప్పుడు తీసుకెడతావ" నడిగింది. కాంతయ్య కుర్చీలో కూర్చుని ఏదో పత్రిక చదువుకుంటున్నాడు. శారదకిదే సరైన సమయమనిపించింది.

"ఇలాంటి సెలవులు ఎక్కువ" అంది. కాంతయ్య నవ్వి వూరుకున్నాడు.

"పాప నాకూడా వచ్చేస్తానంటోంది."

శారదగుండె చెవులదగ్గరకొచ్చేసి దడదడ కొట్టుకుంటోంది.

కాంతయ్య నవ్వాడు. "ఆ... చిన్నపిల్లకదూ! అదీకాక చాలాకాలమైన తరవాత వచ్చావుకదూ? నువ్వంటే దానికి ప్రాణం" అన్నాడు.

"వేళాకోళంకాదు... నేను నిజంగా పాపను తీసుకోపోతాను, ఆయనకూడా ఎంతో ముచ్చట పడుతున్నాడు."

కాంతయ్య విచిత్రంగా చూశాడు:

"ఏమిటి నువ్వనేది?"

"పాపను తీసికెళ్ళి కొంతకాలం నా దగ్గరుంచుకుంటాను."

"అదేమిటి శారదా!... విచిత్రంగా మాట్లాడుతున్నావు? పాప నా దగ్గరేవుండాలి. ఆమెను చూట్టానికి సీత వుందిగా నీకు ముచ్చటగా వుంటే మధ్యమధ్య వచ్చిచూసి పోతూవుండు. అదికూడా కనిపించకపోతే నేను బతగ్గలనా?"

చాలా పరుషంగా మాట్లాడాడు కాంతయ్య. ఎదురు ప్రశ్నకు తావులేండా పోయింది. జీవితానుభవాన్ని కరిగించి తాగిన కాంతయ్య శారద మనోభావాన్ని గ్రహించాడు. ఆ మాటతో శారద సమస్యను వేస్టుపేపర్ బేస్కట్‌లో పడేలేదు. ఎదిరించి నిలిచింది. ఏవేవోమాటలంది. కాంతయ్య కూడా ఎగిరిపడ్డాడు. శారద అన్నమాటలన్నీ విషపూరితంగా కనిపించాయి. రావమ్మ మాటలు నిరంతరం చెవుల్లో ప్రతిధ్వనించాయ్. ఎన్నో మాటలు ప్రవాహంలో చెత్తలా దొర్లిపోయాయ్.

"పోనీ? తీసుకెళ్ళ నివ్వండి. అందులో తప్పేముంది?" అని సీత అనగానే శారద ఆశ్చర్యపోయింది.

"అంత పట్టుదలెందుకు? అక్కడికి నా కూతురి మీద నాకు ప్రేమలేనట్టు-నాకేదీ సవ్యంగా కనిపించటంలేదు." అనరిచాడు కాంతయ్య. ఆశావృక్షం మొదలంట నరకబడింది. శారద తన ప్రయత్నంలో ఓడిపోయింది.

మధ్యాన్నం పాపను తీసుకుని రావమ్మ ఇంటికి వెళ్ళింది. జరిగిన కురుక్షేత్ర సంగ్రామాన్నంతా వర్ణించింది.

"అంతేనమ్మా!... మీ నాన్న పూర్తిగా మారిపోయాడు. ఎవరేం చేస్తారు? ఇంక వదిలేసి పోవల్సిందే. బలవంతంగా తీసికెడితే కోర్టుచుట్టూ తిరగాల్సిందే!... మీ ఆయన్నే సలహా అడుగు. మరో రెండురోజులాగి చూడకూడదూ?... వీలైనప్పుడు విషయం మళ్ళీ కదుపు.. సరదాకి ముచ్చట కొలదీ తీసుకెడుతున్నాను కాని మీ మీద ద్వేషంతో కాని మీరు కాల్చుకుతింటున్నారని కాదు. అని చెప్పిచూడు. నయాన్నే సాధించుకురావాలి, ఏమైనాసరే. పిల్లనుమాత్రం ఇక్కడ వదిలేసి పోకు." అనీ వుపన్యాస ధోరణిలో పలికింది. శారద కేమీ పాలు పోలేదు.

వారంరోజులు గడిచాయి. తండ్రిని ఒప్పించటం తలకు మించిన పనైంది. శారదలో మిడిసిపాటుందని భావించిన కాంతయ్య తన మాట మీదే నిలబడ్డాడు. మర్నాడు రామకృష్ణదగ్గర్నుంచి వుత్తరంవచ్చింది. తనకు వంటో బాగా లేదని, తరుచు జ్వరం వస్తోందని రెండురోజులుగా ఆఫీసుకు వెళ్ళటంలేదని వెంటనే రావలసిందని రాశాడు. తనువస్తున్నప్పుడే రామకృష్ణ జ్వరంతో బాధపడి లేచాడన్న సంగతి శారద కప్పుడు జ్ఞప్తికొచ్చింది.

మర్నాడే ప్రయాణమై వెళ్ళిపోయింది. వెళ్ళిపోతుంటే పాపగుండె చెరువయ్యేలా ఏడుస్తూ "నన్ను తీసికెడతానని అబద్ధమాడావు" అని గోల పెట్టింది. శారద మళ్ళీవచ్చి తప్పకుండా తీసుకెడతానంది. పరిస్థితులు విషమిస్తే తనకు త్తరం రాయమని రావమ్మ నొప్పించింది.

* * *

రామకృష్ణకు మామూలు జ్వరమే — శారద వచ్చిన వారం రోజులకు తగ్గిపోయింది. జరిగిందంతా అడిగి తెలుసుకున్న రామకృష్ణ ఎలాంటి ఆసక్తి చూపలేదు.

"అంతేమరి-మనమేం చేస్తాం?" అని వూరుకున్నాడు.

శారద కూడా తనకు తానేదో సాకులు చెప్పుకుంటూ మనసు నోదార్చుకోటానికి ప్రయత్నించింది. కాని కిరసనాయిలుమంట నీటితో చల్లబడనట్టు అదీ చల్లబడలేదు. రోజులు గడుస్తున్నకొలదీ విచిత్రమైన మార్పులు వస్తున్న శారదను చూసి

రామకృష్ణ హడలిపోయాడు. ఆమె నవ్వుతుంటే విషాదం వరదలుగా ప్రవహించింది.

శారద గోవిందపురం తిరిగివచ్చాక నెల గడిచింది. ఈ నెలరోజుల్లో తండ్రి ఓ వుత్తరం రాశాడు. పాప క్షేమంగా వుందని రాశాడు. కార్డులో నాలుగే పంక్తులు. తండ్రి మనఃకాఠిన్యానికి విచారించడం తప్పమరేమీ చేయలేకపోయింది. జవాబు రాయాల్సిన అవసరం కూడా ఆమెకుకనిపించలేదు.

ఆ మర్నాడే రావమ్మ రాసినవుత్తరం అందింది. ఏదో శారద అమ్మమ్మ మీదున్న అభిమానంతో వుత్తరం రాస్తున్నానని ప్రారంభించి, పాప బాగా చిక్కిపోయిందని, సవిత్తల్లి పోరు విపరీతంగా వుందని రాయటానికి తన కిష్టంలేకపోయినా ఒప్పుకున్నందుకు రాస్తున్నానని పూర్తిచేసింది.

ఆవేళాదివారం రామకృష్ణ హాల్లో కుర్చీలో కూర్చుని "రీడర్స్ డైజెస్టు" చదువుకుంటున్నాడు. శారద శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. వీధిలో బండి ఆగటం-శారద బల్లమీదనుంచి బయటికొచ్చేలోగా బండిలోంచి అమ్మమ్మ దిగటం జరిగింది. శారదకు ఎక్కడో పారేసుకున్న అమూల్యరత్నం దొరికినట్టయింది. ముసలమ్మ సామానులన్నీ హాల్లో పెట్టించి బండివాడితో పావుగంట యుద్ధంచేసి చివరి కెలాగో సంధి సాధించింది.

"అమ్మాయ్! బాగా చిక్కిపోయావుసుమా! ఏం! అలా వున్నావు?" అంటూ బల్లమీద కూర్చుంది.

"కాశీనుంచేనా రావటం?"

"ఆ...కాని ఎంతకాలంనుంచో అనుకుంటున్నా- ఇన్నాళ్ళకా విశ్వేశ్వరుడి దయకలిగింది" అని ప్రయాణాన్ని పావుగంట వర్ణించాక 'ఇంతకీ పెళ్ళికి వెళ్ళివచ్చారా?' అనడిగింది,

"వెళ్ళలేదుకాని వెళ్ళని తెలిసి నీలాగ పారిపోలేదు" అంది శాదర కసిగా.

"అంత నిష్ఠూరమెందుకే?... ఆ పరిస్థితుల్లో నువ్వుంటేమాత్రం ఏం చేస్తావు? కన్నకూతుర్ని పొట్టబెట్టుకున్నాడు. ఇన్నేళ్లొచ్చినా మరోత్తైను చేసుకుంటే ఎలాచూగలను? అదీకాక నాకు మతిలేదు. ముసిలితనం కదూ!...తోడుదొరగ్గానే వెళ్ళిపోయాను"

శారద తను తండ్రిదగ్గరకు వెళ్ళింది - ఎలా శృంగభంగమైందీ వివరించింది.

"అంతేనమ్మా - అంతే" జీవితాన్నంతా సానుభూతిగా చూస్తూ నిట్టూర్చింది.

ఆరాత్రే శారదడిగింది. "అమ్మమ్మా! నీకాళ్లు పట్టుకుని బతిమాలుతాను. నువ్వు పాపకోసం మళ్ళీ వెళ్లి తీరాల్సిందే."

"నీకేమన్నా పిచ్చా? వాడు నన్నక్కడుండనిస్తాడా? అంతమంచివాడైతే ఇలా తరిమేస్తాడా? నేను మాత్రం ససేమిరా వెళ్ళను. అన్నింటికీ ఆ దేవుడే వున్నాడు."

శారద రెండు అగాధాలమధ్య నిలబడి ఎటు పోటానికి వీల్లేక వూరుకుంది. రామకృష్ణకూడా ముసలమ్మకు చెప్పి చూశాడు కాని ప్రయోజనం లేకపోయింది. అక్కణ్ణుంచి కూడా పోతానంది. మరినాలుగురోజులు ఏడుస్తూ జరిగిపోయాయ్.

అయిదోనాడు టెలిగ్రాం వచ్చింది. పాపకు జబ్బుగా వుందని వెంటనే రమ్మని కాంతయ్య టెలిగ్రాం ఇచ్చాడు. ఈసారి ముసలమ్మకు తప్పింది కాదు. శారద భయవిహ్వల హృదయంతో బయలుదేరింది.

ఇద్దరూ వెళ్ళేసరికి పాపకు సీరియస్‌గావుంది. సీత పాప మంచందగ్గరే కూర్చునుంది. సీత మొహంలో ఎక్కడా కళ లేకపోవటం శారదను ఆశ్చర్యాన్నే కలిగించింది.

శారద గుడ్ల నీరునింపుకుంటూ "నాచెల్లెల్ని అందరూ కలిసి చంపేస్తున్నారు" అనరిచింది. ఉద్రేకంలో అందర్నీ కలిపి తిట్టింది. పాపకు ఇంత ప్రమాదించేవరకూ తనెందుకు టెలిగ్రాం ఇవ్వలేదని తండ్రిని నిలదీసడిగింది.

"తగ్గిపోతుందనుకున్నాం. అనవసరంగా నిన్ను కంగారెత్తించటమెందుకని వూరుకున్నాం-అంతే. ఇప్పుడు పాపకువచ్చినభయమేమీలేదు" అందిసీత. శారద కామాటలు ఏమాత్రం ఉపశాంతి నివ్వలేదు.

శారదవచ్చి మూడురోజులైంది. కాంతయ్య సరిగ్గా ఇంటిదగ్గరుండక తప్పించుకుతిరుగుతున్నాడు. తనులేని సమయంలో నిజంగా సీత పాపనురాచి రంపాన పెట్టిందేమోనన్న అనుమానం అతనిలో కూడా విజృంభించింది. అందుకే అతను కూతురి మొహం ధైర్యంగా చూడలేకపోతున్నాడు.

శారదమాత్రం తిండిమానుకుని పాపకు శుశ్రూష చేస్తోంది. ముసిల్దానికి కాంతయ్యను తిట్టిపోయటంతోనే సరిపోయింది. ఆమె కాంతయ్య మీదికి చాటుగా విసిరినకొన్ని శాపనార్థాలు శారదను భయపెట్టాయికూడా - ఆమాటలు సీత వినుంటే ఈపాటికి ఏనుయ్యో-గొయ్యో-చూసుకుంటుందనుకుంది శారద.

మరో వారంరోజులకు పాపకు జ్వరం తగ్గుముఖం పట్టింది. అదంతా శారద చేసిన సేవవలనేనని డాక్టరు అన్నాడు. సీతకూడా పాపను బాగా చూసుకుందని డాక్టరు అంటుంటే ముసలమ్మ కోపాన్ని ఆపుకోలేక బాధపడింది.

క్రమంగా పాప కోలుకుని తిరగసాగింది.

"పాపా! నిన్ను సీత ఎంత బాధపెట్టిందోకదా. నా తల్లివి.ఎంతెలా మారిపోయావే?"అంది శారద.

"లేదక్కయ్యా! అమ్మ నన్ను ఎంతో బాగా చూసుకుంది. అల్లరిగా తిరగనివ్వకుండా చూసుకుంది" అంది పాప.

"ఇంకేం? వశంచేసుకుంది" అంది ముసిల్ది.

ఆ రాత్రి ఏడుగంటలకు ఓ కుర్రాడు పరుగెత్తుకొచ్చాడు.

"కాంతయ్య మేష్టారిల్లిదేకదండీ?" అనడిగాడు.

"అవు"నంది శారద.

"మేష్టారు చాలా ప్రమాదంలో వున్నారండి. సినిమారోడ్డు జంక్షన్ దగ్గర పరధ్యానంగా నడుస్తూ కారుకింద పడిపోయారండి హాస్పిటల్లో వున్నారు."

శారద గడగడ వణికిపోయింది. తండ్రి తనపట్ల అమానుషంగా ప్రవర్తించినా అతనిమీదున్న అనురాగం ఎక్కడికి పోతుంది? సీతా-శారదా గబగబా బండిలో హాస్పిటల్ చేరుకున్నారు. ముసలమ్మ కూడా పాపను తీసుకునివచ్చింది. కాంతయ్య పరిస్థితి ఆశాజనకంగా లేవని డాక్టర్లు పెదవి విరిచారు.

కాంతయ్య కడసారి కళ్ళు తెరచి చుట్టూవున్న వాళ్ళందర్నీ పరికించి చూశాడు. తన జీవితాధ్యాయం ముగిసిందని అతనూ గ్రహించుకున్నాడు బాధతో మాట్లాడాడు.

"అమ్మా శారదా!...నువ్వంటే నాకు పంచప్రాణాలూను. నేను కొంచెం దురుసుగాప్రవర్తించానుకో. కాని ఏంచేయను? పరిస్థితి అలాంటిది... అదంతా ఇప్పుడెందుకు? ఇంక సీతసంగతి. అది సవితితల్లి కనక పాపను నానా బాధలూ పెట్టిందని నువ్వనుకుంటున్నావు. కాని దానికేం తెలియదు, పట్టి అమాయకురాలు పాపను కంటికి రెప్పలా చూసుకుంటుంది కాని నలుగురిలా మాట్లాడటం చేతకాదు. దాని హృదయంలో అనురాగమూ లేదు. ద్వేషమూ లేదు. అదోకరాయి.నా ఆస్తంతా దానికే ఇచ్చాను. పాపపెళ్ళికి వేరే అట్టేపెట్టాను. దాన్ని మాత్రం వదిలేయకు - సీతను ఏమీ అనకు. దాని బతుకిలాగైపోయింది..."

అతనింక మాట్లాడలేదు.

పదిహేను రోజులు గడిచాయి.

రావలసినవాళ్ళంతా వచ్చారు. పరామర్శించారు. కాంతయ్యదే తప్పు కనక కారుడ్రైవరు తప్పించుకున్నాడు.

"పాపా! నాకూడా వస్తావా? ఇక్కడే వుంటావా?" అనడిగింది శారద.

"ఇక్కడే వుంటాను" అంది పాప.

ఈ సమాధానం శారదకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. చివరికి సీతకు తోడుగా అమ్మమ్మ వుండటానికి ఒప్పుకునేసరికి శారద తెల్లబోయింది. పక్కింటి రావమ్మకు మునుపటికిమల్లే చిల్లరసామానులు దానంచెయ్యకుండా సీత కట్టుదిట్టంచేయటం వలన సీతమీద రావమ్మ దుమారంలేవదీసిందన్న సంగతి కూడా శారద తరవాత తెలుసుకుని ఆమెతో మాట్లాడటం మానుకుంది.

వచ్చేయమని రామకృష్ణ వుత్తరం రాయటంవలన శారద బయలు దేరింది. పాప ఈసారి ఏడవలేదు. నవ్వుతూ సీతవొడిలో కూర్చుంది. ఆ సీతను తల్చుకునేసరికి శారదకు గుండె జల్లుమంది. ఆమె జీవితానికింక శాశ్వతంగా ముడుతలతెర దిగిపోయింది. నుదుటిమీదున్న దమ్మిడీయంత కుంకంబొట్టు ఆకాశపు ఎర్రదనంలో కలిసిపోయింది. ఇంక ఈ జన్మకది తిరిగిరాదు.

అంతా అయిపోయింది.

రైలు కదలబోతుంటే కిటికీలోంచి ఇంటికి సీతవెంట తిరిగి వెడుతున్న పాపను చూసేసరికి శారదకు కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. మంగళసూత్రం అప్రయత్నంగా చేతికి తగిలేసరికి ఎందుకో ఆమె గుండె జల్లుమంది.

★